
# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక



**THE WORD OF TRUTH**

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సుళువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు-మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంధాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

**Editor :**
**J. C. CHOATE**

**Managing Editor :**
**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంచిక 1 — ఆగష్టు 1988 — సంపుటి 9


## సంపాదకీయము

### నీవేమి చూస్తున్నావు?

యేసునకు సంబంధించి మనమీలాగున చదువగలము. "అంతలో వారు బేత్సయిదాకు వచ్చిరి. అప్పుడు అక్కడివారు ఆయన యొద్దకు ఒక గుడ్డివాడిని తోడ్కొని వచ్చి వాని ముట్టవలెనని ఆయనను వేడుకొనిరి. ఆయన ఆ గుడ్డివాని చెయ్యి పట్టుకొని ఊరు వెలుపలికి తోడ్కొనిపోయి వాని కన్నులమీద ఉమ్మివేసి వానిమీద చేతులుంచి. నీకేమైననూ కనబడుచున్నదా? అని వాని నడుగగా వాడు కన్నులెత్తి మనుష్యులు నాకు కనబడుచున్నారు. వారు చెట్లవలె నడుచుచున్నట్లుగా నాకు కనబడుచున్నారనెను. అంతట ఆయన మరల తన చేతులు వాని కన్నులమీద నుంచగా వాడు తేరిచూచి కుదుర్చబడి సమస్తమును తేటగా చూడసాగెను. అప్పుడు యేసు నీవు వూరిలోనికి వెళ్ళవద్దని చెప్పి వాని యింటికి వానిని పంపివేసెను" (మార్కు 8:22-26).

యేసుకు అద్భుతములుచేయు శక్తి కలదు. గ్రుడ్డివాని విషయములో ఆయన అతనికి చూపును ఇచ్చియున్నాడు. మొదటిగా ఆయన నీకేమి కనబడుచున్నది అని అడిగినప్పుడు వాడు మనుష్యులు చెట్లవలె నడుచుచున్నట్లుగా కనబడుచున్నదని చెప్పి యున్నాడు. అప్పటికి అతనికి చూపు పూర్తిగా రాలేదు. కానీ యేసు ఆయన చేతులను అతని కన్నులమీద ఉంచిన తరువాత అతనికి చూపు పూర్తిగా వచ్చినది.

దేవుని సంఘము విషయములో లక్షలాది ప్రజలు గ్రుడ్డివారుగా కనబడుచున్నారు. వారు దేవుని సంఘమును ఒక కట్టడముగానూ, ఒక మతశాఖగానూ, డినామినేషనుగానూ, మానవునిచే నిర్మితమైనదిగాను ఎంచి దానిని ప్రాముఖ్యత లేనిదానిగా చూచుచున్నారు.

వీరిలోనే చాలామంది "పోప్" ను క్రీస్తుకు బదులుగా సంఘానికి అధిపతిగా చూచుచున్నారు. సంఘముయొక్క పేరులో ప్రాముఖ్యత లేదనియు, నమ్మకముగాను, నిజాయితీగాను దేవుని ఆరాధించినప్పుడు అటువంటి వాటిని పట్టించుకోనవసరం లేదని భావిస్తారు.

కొంతమంది బాప్తిస్మములోని ప్రాముఖ్యతను చూడలేరు. నిజాయితీగా జీవించినట్లయితే రక్షణ కలుగుతుందని భావిస్తారు. కొంతమంది క్రీస్తును పునరుత్థానుడుగా చూడలేరు. ఆయననే దేవుని కుమారునిగా చూడలేరు. వారు క్రీస్తును ఒక మానవమాత్రునిగా మాత్రమే చూస్తారు.

కొంతమంది క్రైస్తవ జీవితములోని కష్టాలను, శ్రమలను మాత్రమే చూడగలరు. వారు క్రీస్తు మరల ఈ లోకంలోనికి రావడం ఏ విధముగా సాధ్యమగునో గ్రహించరు. అలాగునే రక్షింపబడినవారు పరలోకమునకు వెళతారనియు; పాపులు నిత్య నరకాగ్నికి గురియై శిక్ష పొందుదురనియు గ్రహింపరు.

వేరొకసందర్భములో క్రీస్తు ఇట్లు పలికెను. "ఇందు నిమిత్తము నేను ఉపమానరీతిగా వారికి బోధించుచున్నాను. ఈ ప్రజలు కనులారా చూచి, చెవులారా విని, హృదయముతో గ్రహించి, మనసు త్రిప్పుకొని నావలన స్వస్థత పొందకుండునట్లు వారి హృదయము క్రొవ్వినది. వారి చెవులు వినుటకు మందములైనవి, వారు తమ కన్నులు మూసికొని యున్నారు. కనుక మీరు వినుటమట్టుకు విందురు గాని గ్రహింపనే గ్రహింపరు. చూచుట మట్టుకు చూతురు గాని ఎంత మాత్రము తెలిసికొనరు అని యెషయా చెప్పిన ప్రవచనము వీరి విషయమై నెరవేరుచున్నది. అయితే మీ కన్నులు చూచుచున్నవి గనుక అవి ధన్యములైనవి. మీ చెవులు వినుచున్నవి గనుక అవి ధన్యములైనవి" (మత్తయి 13:13-17).

భౌతికమైన చూపు చాలా సుందరమైనది. కాని దానికన్న ఆత్మీయ సంబంధమైన చూపు చాలా ముఖ్యమైనది. చాలా సందర్భాలలో లేఖనములు ఈ విషయమును గూర్చి చెప్పుచున్నవి. "నేను దానిని చూడలేకపోవుచున్నాను" అని ఎవరైనా అనడము మనము వింటాము. కొంతమంది "దానిని చూడడం చాలా తేలిక" అని అనడం వింటాము. ఈ రెండు విషయాలలో వారు దానిని అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నట్లుగా మాట్లాడుకోవడం చూస్తున్నాము. లేదా వారు మాటలాడిన దానిని అర్థం చేసుకోలేక పోయినట్లుగా చూస్తున్నాము.

ఎందుచేత యింతమంది సత్యాన్ని చూడలేకపోవుచున్నారు? ఎందుచేతనంటే వారు దేవుని మాటను లేదా వాక్యాన్ని లక్ష్యపెట్టక యుండి మోసగింపబడుచున్నారు. లేదా దానిని అర్థం చేసుకోవడం వారికి నచ్చకపోవడంవల్ల సత్యాన్ని గ్రహింపలేక పోవుచున్నారు. ఇది చాలా విచారకరమైన విషయము. దేవుడు తన ఉద్దేశమును మనకు స్పష్టముగా బయలుపరచి యున్నాడు. ఎవరైనా అర్థం చేసుకోవాలని తలంచినట్లయితే సులభముగా అర్థం చేసుకొనవచ్చును.

ఎవరైనా దేవుని వాక్యమును చదివి దానిని గ్రహించినట్లయితే అతని మనస్సులోని అసూయ తొలగిపోయి దేవుని చిత్తాన్ని తెలుసుకొని దానికి లోబడతాడు. అప్పుడు దేవుని వాక్యము చాలా తేలికగాను, సులభముగాను అర్థమగును.

నా స్నేహితుడా నీవు కండ్లు మూసుకొని దేనినీ చూడలేవు. నీవు చూడకూడదు అనుకున్న దానిని కూడా చూడలేవు. మరి నీవు దేనిని చూస్తావు? యితరులు నీలో దేనిని చూస్తారు? యేసు నీలో దేనిని చూస్తాడు?

---

## వెయ్యేండ్ల పాలన ఎక్కడిది–మానవునిదా? దేవునిదా?

### (Premillenialism, from Man or God?)

క్రీస్తు శకము మొదటి శతాబ్దములో రాజ్యమును స్థాపించుటకు దేవుడు సంకల్పించాడు (దాని 2:44). ఆ రాజ్యాన్ని స్థాపించడానికి క్రీస్తు మొదటి శతాబ్దములో వచ్చాడు (మార్కు 9:1). "నీవు రాజువా?" అని పిలాతు యేసు నడిగాడు. "యేసు - నీవన్నట్టు నేను రాజునే, సత్యమును గూర్చి సాక్ష్య మిచ్చుటకు నేను పుట్టితిని; ఇందు నిమిత్తమే యీ లోకమునకు వచ్చితిని" అని చెప్పాడు (యోహాను 18:37). ఆయన ఏమి చేయడానికి వచ్చాడో దాన్ని సాధించాడు. దేవునికి ప్రార్థిస్తూ చేయుటకు నీవు నా కిచ్చిన పని నేను సంపూర్ణముగా నెరవేర్చితినని" ఆయన పలికాడు (యోహాను 17:4). ఎవరైనా దేవుని రాజ్యము స్థాపించబడిందనే వాస్తవాన్ని అంగీకరించడానికిది చాలును. అయినను రాజ్యము భావిలో ఎప్పుడో స్థాపించబడునని ఎదురుచూచే వారున్నారు! వార్లు వెయ్యేండ్లపాలనవాదులు. అయితే క్రీస్తు భూమి మీద వెయ్యేండ్ల మట్టుకు పాలన చేయునని చెప్పే లేఖన భాగమేమీ లేదని గ్రహించుకోవాలి. రాజ్యము స్థాపించబడక

ముందు రెండు ప్రాముఖ్య సంగతులు జరుగునని వెయ్యేండ్ల పాలన వాదులు ఎదురు చూచుచున్నారు: ఎత్తబడుట (Rapture) మరియు మహాశ్రమకాలము (the Great Tribulation).

## 'వెయ్యేండ్ల' వాదులు చెప్పే ఎత్తబడుట

క్రీస్తు ఒక్కసారికాదు గాని రెండుసార్లు తిరిగి వస్తాడని వెయ్యేండ్ల పాలన వాదులు చెబుతారు. వీరి బోధ ప్రకారము ఆయన మొదట వచ్చినప్పుడు మృతులైనట్టియు, సజీవులైనట్టియు తన అనుచరులను రహస్యముగా కొనిపోవుటకు ఆయన వచ్చును. యిదే 'ఎత్తబడుట' యని వారు చెబుతారు. ఇలాగ రహస్యముగా ఎత్తబడినవారు తీర్పు తీర్చబడి తమ ఫలమును పొందుతారు. మరియు ఏడు సంవత్సరముల మట్టుకు వారు ప్రభువుతో పరలోకములో యుంటారు.

లేఖనాల్లో 'ఎత్తబడుట' (Rapture) అనే మాటగాని, దాని బోధగాని యేమీ లేదు. సరిగదా క్రీస్తు మరల వచ్చునప్పుడు ప్రతి నేత్రము ఆయనను చూచునని బోధించుచున్నవి (ప్రక 1:7). మరియు ఆయన గొప్ప ఆర్భాటముతో, అగ్నిజ్వాలలలో, బూరధ్వనితో వచ్చునని అవి బోధించుచున్నవి (2 పేతురు 3:10; 1 థెస్స 4:16, 17; 2 థెస్స 1:7-10). అంతే కాకుండ, క్రీస్తు ఇంక ఒకే ఒక్కసారి మాత్రమే తిరిగి వస్తాడని లేఖనములు బోధించుచున్నవి (హెబ్రీ 9:28). అప్పుడు నీతిమంతులు, దుర్మార్గులు కూడ తీర్పు తీర్చబడి తమ క్రియలను బట్టి ప్రతిఫలము పొందుదురు (2 కొరింథీ 5:10; ప్రక 22:12). మరల, గురుగులను గూర్చి క్రీస్తు చెప్పిన ఉపమాన ప్రకారము దుర్మార్గులకు శిక్ష విధించబడక ముందు నీతిమంతులు ప్రత్యేకముగా తీర్పు తీర్చబడుటకు రహస్యముగా కొనిపోబడరు (మత్త 13:24-43). అట్టి అబద్ధ బోధకు దేవుని వాక్యములో సమయం, స్థానం ఇయ్యబడలేదు.

## 'మహాశ్రమకాలము'

పరిశుద్ధులు పైకెత్తబడిన తరువాత, ఏడు సంవత్సరములమట్టుకు 'మహాశ్రమకాలము' సంభవించునని వెయ్యేండ్ల పాలనవారు వాదిస్తారు. పైకెత్తబడగా భూమి మీద మిగిలిపోయినవారు అంతకంతకు ఎక్కువైన శ్రమల నెదుర్కొంటారు. ఈ యేడు సంవత్సరాలల్లోను (ఎత్తబడియున్న కారణమువలన భూమిమీద క్రీస్తు గాని, పరిశుద్ధాత్ముడు గాని, రక్షింపబడిన వారెవరు గాని లేకపోయుననను) ప్రజలు ఏలాగోలాగున యేసుక్రీస్తువైపు మార్పు జెందుతారు! ఈ యేడు సంవత్సరముల శ్రమకాలపు మధ్యలో మహా శ్రమ కాలము ఆరంభమగును. అంత్య క్రీస్తు దర్శన మిస్తాడు. అప్పుడు ఇశ్రాయేలీయులు అతనితో నిబంధన చేసికొంటారు. క్రొత్త పరిశుద్ధులు హతమార్చబడతారు. పరిస్థితి అంతా పాడైపోతాది. చివరిగా, మానవజాతి నాశనముగావించబడక ముందు, క్రీస్తు తన రాజ్యమును స్థాపించుటకు మరింకొకసారి దర్శనమిస్తాడు. పైకెత్తబడుటను గూర్చిన యట్లే ఈ మహాశ్రమ కాలమును గూర్చి కూడ వెయ్యేండ్ల పాలన వాదులు పొరబడ్డారు.

క్రొత్త నిబంధనలో యేసు గాని, అపొస్తలులు గాని శ్రమను గూర్చి కనీసం 20 సార్లు పలికారు. శ్రమ అంటే నమ్మకమైన క్రైస్తవులకు కలిగే బాధలు, శోధనలు, హింసలు అని వారి ఉద్దేశము. యేసు ఇట్లన్నాడు : "దాసుడు తన యజమానుని కంటె గొప్పవాడు కాడని నేను మీతో చెప్పిన మాట జ్ఞాపకము చేసికొనుడి. లోకులు నన్ను హింసించిన యెడల మిమ్మును కూడ హింసింతురు" (యోహాను 15:20). "మీ సహోదరుడను, యేసును బట్టి కలుగు శ్రమలోను రాజ్యములోను సహనములోను పాలివాడనైన యోహానను నేను" అని యోహాను తన్ను గూర్చి చెప్పుకొన్నాడు (ప్రక 1:9). "అనేక శ్రమలు అనుభవించి మనము దేవుని రాజ్యములో ప్రవేశింపవలెనని" అపో.కా. 14:22 బయలు పర్చుచున్నది. అట్టి శ్రమలలో పాలివారై

యున్నట్టుగా మనము మహానందముతో సంతోషించాలి (1 పేతురు 4:13). ఏలయనగా పరలోకమందు మన ఫలము అధిక మగును (మత్త 5:10-12). ప్రభువు వచ్చువరకు, ఈ లోకము అంతమయ్యే వరకు శ్రమలు కలుగుచునే యుంటాయి.

ముగింపు

క్రీస్తు విధించిన రక్షణ షరతుల నంగీకరింపని వానికి రెండో తరుణం (second chance) అంటూ యేమీ వుండదు. క్రీస్తు మరల వచ్చునప్పుడు అంతము సంభవించును. అయితే క్రీస్తు మరల ఎప్పుడు వచ్చుచున్నాడు? దేవునికి తప్ప మరెవనికి తెలియదు (మత్త 24:36). "అయితే ప్రభువుదినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించిపోవును, పంచభూతములు మిక్కుటమైన వేండ్రముతో లయమై పోవును, భూమియు దాని మీదనున్న కృత్యములును కాలిపోవును" (2 పేతురు 3:10). యేసుక్రీస్తు మరల తప్పక వచ్చుచున్నాడు, గాని వెయ్యేండ్ల పాలన వాదుల కార్య క్రమము ప్రకారము కాదు. "ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము" (2 కొరింథీ 6:2). ప్రభువు ఎప్పుడు వచ్చునో ఎవనికిని తెలియదు గనుక మెలకువగా యుండి ప్రార్థన చేయుడి (మత్త 24:42; మార్కు 13:13).

నీవు ఇప్పుడు ఆయన రాజ్య నివాసుడవా? ఆయన రాకడ కొరకు సిద్ధపడి యున్నావా?

—మాంటీ మెక్‌నైర్.

## తీర్పు నాటి కొన్ని విస్మయములు

## (Some Judgment day Surprises)

భవిష్యత్ నందు నిత్య తీర్పునందు నీకు నమ్మిక గలదా? మృతులకు సజీవులకు తీర్పు తీర్చగల వానికి నీవు ఏదో యొక దినమున

లెక్క అప్పగించవలెనన్నుట యందు నీకు నమ్మిక గలదా? ఆ దినమున చీకటియందు నిగూఢమైన విషయములు వెలుగులోనికి రప్పింపబడు ననియు, హృదయాలోచనలు బయలు పడుననియు నీవు నమ్ముదువా? తీర్పు అనునది దేవునియొక్క గొప్ప బయలుపాటులో యొక భాగమని నీవు నమ్ముదువా? ఇది నమ్మవలసిన ఆవశ్యకత గలదని నేను చెప్పు చున్నాను. అయితే జన సమూహములు ఇట్టి వాటిని నమ్మరు. వారు నమ్మరు గనుక వారి అంతము భయంకరముగా నుండును.

## తీర్పు దిన మొకటి కలదు

మానవుడు దేవుని కలసికొను యిట్టి గొప్ప కలయికను గూర్చి స్పష్టముగా బైబిలు విశదీకరించినది. "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు. ఎందుకనగా తాను నియమించిన మనుష్యునిచేత నీతి ననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చబోవుచున్న యొక దినమును నిర్ణయించి యున్నాడు" (అ.కా. 17:30, 31). "ఎందుకనగా తాను జరిగించిన క్రియలచొప్పున, అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మన మందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరి 5:10). "మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:27). "మరియు గొప్పవారేమి కొద్దివారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడి యుండుట చూచితిని. అప్పుడు గ్రంథములు విప్పబడెను; మరియు జీవగ్రంథమను వేరొక గ్రంథము విప్పబడెను; ఆ గ్రంథములయందు వ్రాయబడియున్న వాటినిబట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పు పొందిరి" (ప్రకటన 20:12). తీర్పుయొక్క ప్రత్యక్షతకు అనేకులు విస్మయ మొందుదురు.

# తీర్పు సమయము

తీర్పు సమయమందు అనేకులు ఆశ్చర్య చకితులగుదురు. "ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి తప్ప ఏ మనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు" (మార్కు 13:32). క్రీస్తు ఆగమనమును ఏ మనుష్యుడును ఎరుగడు, దూతలు ఎరుగరు, తండ్రికి తప్ప కుమారునికి గూడ తెలియదు. అంత్య దినమున క్రీస్తు ఆగమనము సంభవించును (యోహాను 12:48).

తీర్పుయొక్క సంకల్పమునకు అనేకులు విస్మయ మొందుదురు. ఒకని యొక్క దోషమును లేదా నిర్దోషత్వమును నిర్ణయించుటకు జరుగు యొక విచారణవంటిది ఆ దినమందు జరుగదు. దేవునికి సమస్తమును తెలియును. ఈ జీవితమందే మనము శోధింపబడి మరణముచేత మన గమ్యమును ముద్రించుకొను చున్నాము. "ఆయన యందు విశ్వాసముంచు వానికి తీర్పు తీర్చబడదు; విశ్వసింపనివాడు దేవుని అద్వితీయ కుమారుని నామమందు విశ్వాస ముంచలేదు గనుక వానికి ఇంతకుమునుపే తీర్పు తీర్చబడెను" (యోహాను 3:18). "నా మాట విని నన్ను పంపిన వానియందు విశ్వాస ముంచువాడు నిత్య జీవముగలవాడు; వాడు తీర్పులోనికి రాక మరణములోనుండి జీవములోనికి దాటి యున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 5:24). ఈ రెండు వాక్య భాగములందు గల వర్తమాన కాలములను సూచించు మాటలను గమనింపుము. రక్షింపబడుటకు లేదా నశించి పోవుటకు మనము తీర్పునాటి వరకు ఎదురు చూడవలసిన అవసరము లేదు. ఇప్పుడే మనము రక్షింపబడవచ్చును లేదా నశించిపోవచ్చును. తీర్పు దినము దుష్టులను శిక్షించుటకు నీతిమంతులకు మహిమకరమగు ప్రతిఫలమును అనుగ్రహించుటకు నియమింపబడెను.

## తీర్పు ప్రామాణికము

తీర్పునాటి ప్రామాణికము లేదా కొలబద్దకు అనేకులు విస్మయ మొందుదురు. ఏలయనగా ఆ దినమందు మానవ ప్రామాణిక గ్రంథ ములకు సిద్ధాంతములకు తావుండదు. మన పితరుల భక్తికి మన స్వకీయ నైతిక ప్రవర్తనకు ఆ దినమందు తావుండదు. మన సత్ భావములకు, నమ్మకములకు నిజాయితీలకు ఆ దినమందు తావుండదు. దేవుని వాక్యమే నాడు ప్రామాణికముగా నుండును. మనప్రభు విట్లనుచు న్నాడు, "నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమున వానికి తీర్పు తీర్చును" (యోహాను 12:48). "ఆ గ్రంథములయందు వ్రాయ బడిన వాటిని బట్టి తమ క్రియలు చొప్పున మృతులు తీర్పు పొందిరి" (ప్రకటన 20:12).

తీర్పునాడు ఉత్పన్నమగు వాటిని గూర్చి అనేకులు విస్మయ మొందుదురు. తొలగిపోవుట వలన వారందరు ఆశ్చర్యపడుదురు. ఏల యనగా కొద్ది వారే రక్షింపబడుట వలన వారు విస్మయము జెందు దురు. విశాల మార్గము ఇరుకు మార్గములను గూర్చి యేసుక్రీస్తు మత్తయి సువార్తలో వివరించుచు ఆయన తీర్పు దినమును గూర్చి బోధించుచున్నాడు (మత్తయి 7:13-14). తీర్పు దినమందు విధించ బడిన అంతిమ శిక్ష నరకములో నిత్యము యుండుటవలన వారు మిక్కిలి విస్మయ మొందుదురు.

—రోయ్ బీస్లే.

---

### "నా కిష్టమే, నీవుశుద్ధుడవు కమ్ము"

### ("I will, be Thou clean")

యేసు ప్రభువు కొండమీద ప్రసంగమును ముగించి దిగి వచ్చి

నప్పుడు బహుజన సమూహము ఆయనను వెంబడించెను. వారిలో ఒక కుష్ఠురోగి తన్ను శుద్ధి చేయుమని ప్రభువును బ్రతిమలాడెను. అతడు తన ఘోర రోగముయొక్క తీవ్రపరిణామము నెరిగియుండెను. తన రోగము సమాజము నుండి అతని వెలి వేసెను. దేవుడు మాత్రమే తన్ను శుద్ధిచేయగలుగునని అతడెరుగును. యేసుప్రభువు ప్రసంగము నతడు దూరమునుండి వినియుండవచ్చును. బహుశ యేసు చేయుచున్న మహాత్కార్యముల నతడు వినియుండవచ్చును.

వినుటవలన విశ్వాసము కలుగును (రోమా 10:17). అతడు యేసు మాటలను విన్నాడు, ఆయన యందు విశ్వాసముంచాడు. తన రోగమును బాగుచేయగల దేవుని కుమారుడాయనే యని అతడు నమ్మాడు. ఆయన కృప నభ్యర్థిస్తు, "ప్రభువా, నీ కిష్టమైతే నన్ను శుద్ధుని చేయగలవనెను" (మత్తయి 8:2). తన్ను శుద్ధుని చేయగల శక్తి యేసులో యున్నదనే విశ్వాసమును, తాను శుద్ధుడు కాగోరుచున్నాననే తన సంసిద్ధతను అతడు వెలిబుచ్చాడు. యేసుయొక్క కృప కొరకు అతడు అభ్యర్థించాడు.

## శుద్ధుడవు కాగోరాలి

ఈ సంఘటనద్వారా మనం కొన్ని పాఠాలు నేర్చుకోవచ్చును. మొదటిగా ఈ కుష్ఠురోగి శుద్ధుడు కాగోరాడు. తన విషయంలో అది సహజమే. కుష్ఠురోగియైన నయమానును గూర్చి మన మెరుగుదుము. అతడుకూడ మనస్ఫూర్తిగా శుద్ధుడు కాగోరాడు. ఒక చిన్న సేవకురాలినుండి పొందిన సమాచారమునుబట్టి అతడు చాల దూరం ప్రయాణం చేసి సమరయకు వచ్చాడు. మరొక మనుష్యుడు బెతెస్థ కోనేటి వద్ద స్వస్థత పొందగోరుచు 38 సంవత్సరాలు గడిపాడు. "స్వస్థతపొంద పొందగోరుచున్నావా?" యని యేసు వాని నడిగాడు (యోహాను 5:6). అతన్ని బాగుచేసాడుపండ్రెండు సంవత్సరములనుండి రక్తస్రావముగల

స్త్రీ కూడ స్వస్థత పొందాలనే గొప్ప ఆశ కలిగి యుండెను. నేను ఆయన వస్త్రములు మాత్రము ముట్టిన బాగుపడుదు ననుకొన్నదామె (మార్కు 5:28). బహు జనసమూహము ఆయన చుట్టు నున్నను ఆమె వచ్చి ఆయన వస్త్రము ముట్టెను. వెంటనే ఆమె బాగుపడెను.

## ప్రభువుకు ఇష్టమే

యేసు చెయ్యి చాపి ఆ కుష్ఠురోగిని ముట్టి "నా కిష్టమే, నీవు శుద్ధుడవు కమ్ము" అని చెప్పెను (మత్తయి 8:3). పాపరోగము గల ప్రతివాడు ఆయన యొద్దకు వచ్చి శుద్ధుడు కావాలని యేసు కోరుచున్నాడు. శరీరానికి కుష్ఠు ఏలాటిదో, ఆత్మకు పాపం అలాటిది. ఆ కుష్ఠురోగివలె, పాపక్షమాపణ కొరకు మనం ఆయన యొద్దకు రావాలి. పాప రోగముతో మనం ఆయన యొద్దకు వెళ్లితే, ఆయన "నా కిష్టమే, శుద్ధుడవు కమ్మని" చెబుతాడు. అందుకే యాకోబు ఇట్లనుచున్నాడు: "దేవుని యొద్దకు రండి, అప్పుడాయన మీ యొద్దకు వచ్చును" (యాకోబు 4:8).

ప్రభువు ఇట్లనుచున్నాడు: "దుర్మార్గుడు మరణము నొందుట వలన నాకు సంతోషము లేదు; దుర్మార్గుడు తన దుర్మార్గతనుండి మరలి బ్రదుకుటవలన నాకు సంతోషము కలుగును" (యెహెజ్కేలు 33:11). ఏఒక్క ఆత్మయు నశించుట దేవుని కిష్టము లేదు. "మనుష్యులందరును రక్షణ పొంది సత్యమును గూర్చిన అనుభవజ్ఞానముగలవారై యుండవలెనని ఆయన యిచ్ఛయించు చున్నాడు" (1 తిమో 2:4). దుష్టులు తమ సొంత యిచ్ఛను బట్టియే మరణింతురు. విశాల మార్గమున పయనించువాడు మరణించుట కిచ్ఛయించుకొన్నవాడు. దేవుని వాక్యానికి అవిధేయుడగుట వలన పాపి తన సొంత మరణాన్ని కోరుకొంటాడు. దుర్మార్గుడు మరణించాలని గాక రక్షింపబడాలని దేవుడు కోరుచున్నను దుర్మార్గులు తమ పాపంలోనే మరణించుచున్నారు.

ప్రభువును సేవించాలనే బలమైన కోరిక యున్నందున సౌలును పౌలుగా ప్రభువు మార్చాడు. ఐతియొపీయ నపుంసకుడు దిట్టమైన సత్యాన్వేషి. గనుకనే ఫిలిప్పును అతనియొద్దకు ఆయన పంపాడు. నీతి భక్తిగల జీవితాన్ని జీవించడానికి బలమైన కోరికగలవాడు గనుక కొర్నేలి యొద్దకు ఆయన పేతురును పంపాడు.

## ప్రభువు చిత్తం వెల్లడి పరచబడింది

యిదే రీతిగ దేవుడు మనయెడల తన చిత్తాన్ని వెల్లబుచ్చాడు. మన కొరకు ఆయన తన ఏకైక కుమారుని అప్పగించాడు. "అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు; ఎట్లనగా మన మింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమా 5:8). తన పరిశుద్ధ వాక్యాన్ని మన కిచ్చుటద్వారా దేవుడు తన చిత్తాన్ని మన యెడల వెల్లడి పరచుచున్నాడు. "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును తప్పు దిద్దుటకును నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమో 3:16, 17). మనలను రక్షించడానికి ఆయన కిష్టమే గనుక ఆయన తన సంఘాన్ని స్థాపించాడు. దేవుని వాక్యాన్ని బోధకులద్వారా, రేడియో, కరపత్రికలు, పుస్తకముల ద్వారా నీవు తెలుసుకొనే అవకాశాన్ని కల్పించి ఆయన నీ యెడల తన ఇష్టాన్ని వెలిబుచ్చుచున్నాడు.

నిన్ను రక్షించి, శుద్ధునిగా చేయుటకు యేసు కోరుచున్నాడు. నీవు శుద్ధుడవు కాగోరుచున్నావా? యెషయా యిట్లనుచున్నాడు: "యెహోవా మీకు దొరుకు కాలమందు ఆయనను వెదకుడి. ఆయన సమీపములో నుండగా ఆయనను వేడుకొనుడి" (యెషయా 55:6).

—కవిత గూటం, కాకినాడ.

# నీనెవె మహా పురము

## ( The Great City of Nineveh )

నీనెవె పట్టణము దేవుని ఉగ్రతకు గురికాకుండ తప్పింపబడిన విధము యోనా గ్రంథమందు చదువగలము. 48 వచనములు 4 అధ్యాయాలు గల ఈ చిన్న పుస్తకంలో నేడు క్రైస్తవుడు నేర్చుకొనదగిన ఎన్నో ఆధ్యాత్మిక పాఠాలున్నాయి. యిది మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడినది. దోష చరిత్రమైన పట్టణము మారుమనస్సు పొందుట ద్వారా ఎట్లు రక్షింపబడగలిగెనో ఈ వృత్తాంతము తెలియజేయు చున్నది. నీనెవె మహాపురము మూడు దినముల ప్రయాణమంత పరిమాణముగల పట్టణము (యోనా 3 : 3). ఈ పట్టణ జనాభా 1,20,000, బహు పశుసంపద గలిగిన పట్టణము.

నీనెవె పట్టణస్థుల దోషము దేవుని దృష్టికి ఘోరమాయెను. ఆయన ఆ మహాపురము విషయములో విచారించి (యోనా 4 : 11), వారు నశింపవలెనని ఇచ్ఛయింపక వారు మారుమనస్సు పొందవలెనని కోరి అమిత్తయి కుమారుడైన యోనాను ఆ పట్టణానికి దుర్గతి కలుగునని ప్రకటించుటకు పంపవలెనని నిశ్చయించెను.

యోనా వెంటనే నీనెవె పట్టణానికి దేవుని ఆజ్ఞ ప్రకారం వెళ్లియుంటే తన జీవితంలో చేదైన, మిక్కిలి భయంకరమైన అనుభవాల్ని అతడు చూడగలిగేవాడు కాదు. అతడు నీనెవె పట్టణానికి కాక యెహోవా సన్నిధిలోనుండి మరో పట్టణానికి పారిపోదలిచెను.

అతడు ఎక్కిన ఓడవారితో "నన్ను ఎత్తి సముద్రములో పడవేయుడి" అని చెప్పవలసిన స్థితికి వచ్చెను. వారు అతనిని సముద్రంలో ఎత్తి పడవేయువలసిన అవసరం వచ్చెను. చివరకి మత్స్యము గర్భములో సముద్రపు నాచులోనుండి యెహోవాకు మారు మనస్సుతో

ప్రార్థన చేసాడు. యోనాను నీనెవె పట్టణానికి పంపడం దేవుని చిత్తము కనుక ఆయన యోనా ప్రార్థనాలకించి మరెన్నటికిని ఎక్కి రాకుండ వేయబడియున్న భూమి గడియలు తెరిచాడు. అనగా "యెహోవా మత్స్యమునకు ఆజ్ఞ ఇయ్యగా అది యోనాను నేలమీద కక్కెను. వెంటనే రెండవసారి యోనాకు ప్రత్యక్షమై సెలవిచ్చిన దేమనగా, నీవు లేచి నీనెవె మహాపురమునకు పోయి నేను నీకు తెలియజేయు సమాచారము దానికి ప్రకటన చేయుము" (యోనా 3:1-2).

యోనా నీనెవె పట్టణానికి నాశనము కలుగునని ప్రకటింపగా, రాజు సింహాసనముమీద నుండి దిగి గోనెపట్ట కట్టుకొని బూడిదలో కూర్చుండి జనులు మనః పూర్వకముగా దేవుని వేడుకొనవలెనని ప్రకటన చేయించెను. "నీనెవెవారు తమ చెడు నడతలను మానుకొనగా వారు చేయుచున్న క్రియలను దేవుడు చూచి పశ్చాత్తప్తుడై వారికి చేయుదునని తాను మాట యిచ్చిన కీడుచేయక మానెను" (యోనా 3:10).

"యోనా దీన్ని చూచి బహు చింతాక్రాంతుడై కోపగించుకొని, యెహోవా నేను నా దేశమందుండగా ఇట్లు జరుగునని నేననుకొంటిని గదా? అందువలననే నీవు కటాక్షమును జాలియును బహు శాంతమును అత్యంత కృపగల దేవుడవై యుండి పశ్చాత్తాపపడి కీడు చేయక మానుదువని నేను తెలిసికొన్ని దానికి ముందుగానే తర్షీషునకు పారిపోతిని" (యోనా 4:1). యోనా ఆలోచన దేవుని సంకల్పమునకు విరుద్ధమైనది. సువార్త ప్రకటించుట ద్వారా మానవులు రక్షింపబడాలన్నదే దేవుని సంకల్పము. జాలియును బహు శాంతమును అత్యంత కృపగలిగిన దేవుడు తన ఆజ్ఞలను గైకొనాలని మానవులను కోరుచున్నాడు. "నేను చెప్పు మాటల ప్రకారం మీరు చేయక ప్రభువా ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు?" (లూకా 6:46).

సువార్త ప్రకటింపకుండ మానవులు రక్షింపబడినట్లయితే ఈ ప్రయాస వ్యర్థమే కదా! సువార్త ప్రకటింపబడకుండానే నీనెవె పట్టణము రక్షింపబడాలని యోనా కోరెను. కాని దేవుని సంకల్పము అది కాదు. సువార్త ప్రకటింపవలసిన బాధ్యత నేడు మానవులకు అప్పగింపబడెను. "వాక్యమును ప్రకటింపుము" (2 తిమో 4:2).

"నన్ను ఎత్తి సముద్రములో పడవేయుడి" అనగానే ఓడవారు ఆలాగు చేయక తెడ్లను బలముగా వేసి ఓడను ఒడ్డునకు తీసుకొని వచ్చుటలో విఫలులైరి. వ్యర్థప్రయాస పడిరి. ఇది మానవ ప్రయత్నము. యోనాను సముద్రములో పడవేయుట దేవుని చిత్తము. ఎందుకనగా అతడు అజ్ఞాతిక్రమము చేసెను. "నరుని హృదయములో ఆలోచనలు అనేకములుగా పుట్టును. యెహోవా యొక్క తీర్మానమే స్థిరము" (సామె 19:21).

నీనెవె పట్టణానికి వెళ్ళకుండ పారిపోదలచిన యోనా తన ప్రయత్నములో సఫలము కాలేకపోయెను. ఆజ్ఞాతిక్రమము వలన శిక్షింపబడి మారుమనస్సు పొంది దేవుని పరిచర్యలో పాలుపొందగలిగెను.

ఆ నాడు నీనెవె పట్టణస్థులు దేవునికి భయపడి విధేయులై ఉగ్రతనుండి రక్షింపబడిరి. క్రీస్తు యుగంలోనున్న నీవు నేను రక్షింపబడాలంటే నమ్మకము, మారుమనస్సు, క్రీస్తు ప్రభువని ఒప్పుకొనుట, బాప్తిస్మము, ఈ ఆజ్ఞలకు విధేయులు కావాలి (అ.కా. 16:31 లూకా 13:3 రోమా 10:9 మార్కు 16:16).

"నీ వాక్య సారాంశము సత్యము" (కీర్త 119:160).

—E.K.V. ప్రసాదరావు, చెయ్యేరు.

# తప్పుడు సిద్ధాంతములు

ప్రస్తుతము మతశాఖల్లో చాలా తప్పుడు సిద్ధాంతాలున్నాయి. ప్రతివారూ అటువంటి తప్పుడు సిద్ధాంతాల బారినుంచి సంరక్షించుకోవలసిన బాధ్యత ఎంతైనా ఉంది. ఎందుచేతనంటే తప్పుడుసిద్ధాంతాల్ని అంగీకరించు వారు నశిస్తారు. అందుచేత ఈ విషయాన్ని గుర్తు పెట్టుకొని తప్పుడు సిద్ధాంతాలకు దూరంగా ఉండాలి.

అసలు సిద్ధాంతం అంటే ఏమిటి? అని ప్రశ్నించుకుంటే "సిద్ధాంతం అనేది బోధింపబడే విషయాలతో కూడ పనిచేస్తేదై యుంటుంది" అని జవాబు దొరుకుతుంది. అంతే కాకుండా అది ఒక నియమానికి గాని లేక కొన్ని నియమాల సమ్మేళనానికి గాని చెందింది. చాలా మంది దానిని విశ్వాసంతో చేసేదని అనుకుంటూ వుంటారు. కాని ఇది ఎంత మాత్రం నిజం కాదు. ఎందుచేతనంటే నిజమైన సిద్ధాంతం బైబిల్ బోధించే విషయం చేసేదై యుంటుంది.

అసలు తప్పుడు సిద్ధాతం అంటే ఏమిటి? "బైబిల్లో కనిపించని సిద్ధాంతాన్ని తప్పుడు సిద్ధాంత మంటారు". ఒక సిద్ధాంతం దేవుని వాక్యముచేత సపోర్ట్ చేయబడకపోయినట్లయితే అది సాతాను సిద్ధాంతము అని చెప్పకోవచ్చు. ఈ దిగువ కొన్ని తప్పుడు సిద్ధాంతాలీయబడినవి :

1. విశ్వాసమొకటే చాలుననేసిద్ధాంతము. కాని బైబిల్ చూచినచో ఈ సిద్ధాంతము తప్పు అని తెలుస్తుంది.

"మనుష్యుడు విశ్వాస మూలమున మాత్రము కాక క్రియల మూలముననే నీతిమంతుడని యెంచబడును" (యాకోబు 2:24).

2. మనసుకు వచ్చిన విధంగా ఆరాధించాలనే సిద్ధాంతము: కాని బైబిల్ పరిశీలించినట్లయితే ఈ సిద్ధాంతము కూడ తప్పు అని తెలుస్తుంది.

"దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెను" (యోహాను 4:24).

3. యాంత్రిక వాయిద్యాల సంగీతం సంఘారాధనలో ఉండాలనే సిద్ధాంతం. ఈ సిద్ధాంతం కూడ తప్పే. బైబిల్ చూచినచో "కాబట్టి ఆత్మతో ప్రార్థన చేతును, మనస్సుతోను ప్రార్థన చేతును ఆత్మతోను పాడుదును, మనస్సుతోను పాడుదును" (1 కొరింధీ 14.15) అని కనిపిస్తుంది.

4. అందరూ రక్షింపబడతారనే సిద్ధాంతము. ఇదికూడ తప్పుడు సిద్ధాంతమే. బైబిల్ చూచినచో ఇలా కనిస్తుంది:
"వీరు నిత్య శిక్షకును నీతిమంతులు నిత్య జీవమునకు పోవుదురు" (మత్తయి 25:46).

5. నరకం లేదనే సిద్ధాంతము. కాని దీనిని గురించి బైబిల్ ఏమి చెప్పుచున్నదో తెలుసా?

"ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడ పరలోకమునుండి అగ్ని జ్వాలలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతి దండన చేయునప్పుడు మిమ్మును శ్రమపరచువారికి శ్రమయు, శ్రమ పొందుచున్న మీకు మాతో కూడ విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి న్యాయమే" (2 థెస్స 1:7-9).

ఇలా చెప్పుకుంటూ పోతే ఇంకా తప్పుడు సిద్ధాంతాలు కనిపిస్తాయి. చివరిగా ఇంకో తప్పుడుసిద్ధాంతము చూచినచో సంఘం అవసరము లేదనే సిద్ధాంతం. ఏ సంఘం అయినా ఫర్వాలేదనే చెప్పే అబద్ధ

సిద్ధాంతము. కాని బైబిలు చూచినచో, సంఘం అత్యంత ప్రాముఖ్యమైనదని తెలియుచున్నది. ఎందుచేతనంటే

1. క్రీస్తు దానిని నిర్మించెను (మత్తయి 16:18, 19)
2. దాని పునాది యేసుక్రీస్తే (మత్తయి 16:18; 1 కొరి 3:11).
3. అది యెరూషలేములో ఆరంభమాయెను (లూకా 23:46-48; అపో: 1, 2 అధ్యాయాలు).
4. అది క్రీ॥శ॥ 33 సం॥లో ఆరంభమాయెను (అపో.కా.2).
5. అది క్రీస్తు నామమును ధరించుకొనెను (రోమా 16:16).
6. దాని సభ్యులు క్రైస్తవులనబడిరి (అపో.కా. 11:26; 25:28; 1 పేతురు 4:16).
7. అది ఒకే ఒక్క సంఘము (ఎఫెసీ 4:4).
8. దాని శిరస్సు క్రీస్తు (కొలస్స 1:18; ఎఫెసీ 1:22, 23).
9. ఆయన దానికొరకు చనిపోయెను (ఎఫెసీ 5:25; అపో.కా. 20:28).
10. ఆయన దాని రక్షకుడు (ఎఫెసీ 5:23).
11. దాని సభ్యత్వ షరతులు ఇవి. (మార్కు 16:16. అపో.కా.2:38).
12. రక్షించబడినవారు దానిలో చేర్చబడిరి (అపో.కా. 2:47).
13. దాని ఆరాధన యిది: యోహాను 4:24; అపో.కా.20:7, ఎఫెసీ 5:19; అపో.కా. 2:42; 1 కొరింథీ 16:2.
14. దాని కృషి యిది: మత్తయి 28:19, 20; యాకోబు 1:27; ఎఫెసీ 4:11-16.
15. దాని ప్రభుత్వము యిది: 1 తిమోతి 3 అధ్యాయము తీతు 1వ అధ్యాయము.
16. బైబిలు దాని ఒకే ఒక్క మార్గదర్శి (గలతీ 1:7-9 ప్రకటన 22:18, 19).
17. అది ఈనాడున్నది (మార్కు 16:15; 16; లూకా 8:11).
18. దాని కొరకు క్రీస్తు మరల రాబోవుచున్నాడు (ఎఫెసీ 5:27).

అదియే క్రీస్తు సంఘము.

బైబిలునందు కనబడు సంఘములో నీవు సభ్యుడివి కాకపోతే నరకం మాత్రం తప్పదు. ఎందుచేతనంటే "నా తండ్రి నాటని ప్రతి మొక్కయు పెల్లగింపబడును" అని బైబిలు బోధించుచున్నది. (సక్షేమం)

—ఇసుకపట్ల ఇశ్రాయెల్, కాకినాడ.

## బాప్తిస్మము విశ్వాసము

## ( *Baptism & Faith* )

బైబిలులోని గొప్ప మాటలలో, భావాలలో విశ్వాసము ఒకటి. శతాబ్దాలు గడిచేకొలదీ దాన్ని అపార్థం చేసుకోవడం, దాని భావాన్ని సంకుచితం చేయడం జరిగింది. అయినను యిది క్రైస్తవ్యానికి ప్రాథమికమైనది. విశ్వాసమనే ఈ మాట క్రైస్తవ బోధనా విధానానికంతటికి వర్తించుచున్నది (కొలస్స 1:23; 1 తిమో 1:2; 1 పేతురు 5:9; యూదా : 3). అయితే ఈ మాట సాధారణంగా వ్యక్తిగత నమ్మకానికి, దేవునిపై నమ్మకానికి, ఆయనకు చూపే విధేయతకు సాధారణంగా వర్తిస్తాది.

పాత నిబంధనలోని ఘనుల జీవిత విజయాలలో దాని ప్రాముఖ్యతను హెబ్రీ 11వ అధ్యాయం మనకు చూపించు చున్నది. దాని కేంద్రస్థానము క్రీస్తు మాటలపై ఆధారపడియున్నదని క్రొత్త నిబంధన చదువరులకు రోమా 10:17 జ్ఞాపకం చేయుచున్నది.

దేవుని వాక్యం వినకుండా, దానికి పూర్ణమైన విధేయత చూపకుండా విశ్వాసం ఉండనేరదు. పాత నిబంధనలోని ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల స్థానంలో క్రీస్తులో రక్షణ నిమిత్తం విశ్వాస మవుసరం. క్రియల పద్ధతి, విశ్వాస పద్ధతియొక్క తారతమ్యం చూపబడినది (రోమా 3:28). సువార్తయొక్క విశ్వాస పద్ధతి యేసు దేవుని కుమా

రుడని మానవ రక్షకుడనే దానిపై ఆధారపడి యున్నది. అందువలన అన్ని చోట్ల యున్న మానవు లందరికి రక్షణ అనుగ్రహించబడునట్లు యేసుయొక్క వర్తమానము ప్రకటించబడుట అత్యవసరం.

## రక్షించే విశ్వాసం విధేయత చూపునట్టిది

మార్టిన్ లూథరు సంస్కరణోద్యమం ప్రకటించినప్పటినుండి, ప్రొటెస్టాంటు లనేకులు 'విశ్వాసము మాత్రమే చాలును' అను దానిని ఉద్ఘాటించి విధేయతను నిర్ఘాటించారు. మార్టిన్ లూథరు యొక్క ప్రముఖ విజ్ఞాపనను అపార్థం చేసుకొని, మానవుని రక్షణలో మానవునియొక్క బాధ్యతాయుక్త నిర్ణయాన్ని నిర్మూలం చేసారు.

అయినను 'విశ్వాసము మాత్రమే' అను పదములు ఆమోద యోగ్యముగా లేఖనాల్లో ఎన్నడు వినియోగింపబడలేదు (యాకో 2:24). అపొ. పౌలు వ్రాసిన పత్రికలలో, విధేయత చూపు నట్టిదే యథార్థమైన విశ్వాసమని మనకు చూపుచున్నాడు. రోమాలోని సంఘముయొక్క "విశ్వాసము సర్వలోకమున ప్రచురము చేయబడు టను", వారి "విధేయత అందరికిని ప్రచురమైనది గనుకను" అతడు సంతోషించాడు (రోమా 1:8; 16:19). "విశ్వాసమునకు విధేయు లగుటను" గూర్చి అతడు వ్రాసాడు (రోమా 1:5). యూదులు క్రీస్తును నమ్ముటకు నిరాకరించుట అవిధేయత యని పౌలు వర్ణించాడు (రోమా 9:31, 32; 10:16-21).

లేఖనములను పరిశోధించుట వలన రక్షించునట్టి విశ్వాసము కొన్ని విశ్వాససూత్రాలకు లేక ప్రమాణాలకు మన సమ్మతిని తెలియ జేయడం మాత్రమే కాదని గ్రహింపవచ్చున్నది. బైబిలులో రక్షించే విశ్వాసము విధేయత చూపించే విశ్వాసము; యిది దేవుని ఆజ్ఞలకు మననుండి ప్రతిస్పందన కోరే విశ్వాసము.

ఈవిశ్వాసముయొక్క మూలసూత్రాన్ని పౌలు ఇట్లు పలికాడు: "అదేమనగా - యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల, నీవు రక్షింపబడుదువు" (రోమా 10:9). హృదయమందున్న విశ్వాసానికి, దాన్ని ఒప్పుకొనే పెదవులకు ఇక్కడున్న సంబంధాన్ని గమనించుము.

## విశ్వాసము బాప్తిస్మ వ్యతిరేకి కాదు

బైబిలులో విపులంగా బోధింపబడి నప్పటికిని, కొందరు బాప్తిస్మము విశ్వాసానికి వ్యతిరేకమైనదని ఎంచి దాన్ని కించపరుస్తారు. అయితే లేఖనాల్లో విశ్వాసము బాప్తిస్మము పరస్పర వ్యతిరేకమైనవి కాదు గాని విధేయతగల విశ్వాసానికి బాప్తిస్మానికి సంబంధం ఉన్నది. బాప్తిస్మము పొందునప్పుడు "మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి" అని పౌలు చెప్పుచున్నాడు (రోమా 6:4). మన విధేయతలో మనం పాపం విషయమై చనిపోయాము (రోమా 6:2), క్రీస్తువలె మనం పాతిపెట్ట బడ్డాము (నీటిలో ముంచబడ్డాము). మరియు నూతన జీవము కలిగి నడుచుకొనునట్లు లేపబడ్డాము.

క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుట, విశ్వాసముద్వారా దేవుని కుమారులగుటలో భాగము (గలతీ 3:26). "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:27). బాప్తిస్మములో కడుగబడుట పాత జీవితంతో వేరుపడుటను సూచించును. "ప్రభువైన యేసుక్రీస్తు నామమునను మన దేవుని ఆత్మయందును మీరు కడుగబడి, పరిశుద్ధ పరచబడినవారై నీతిమంతులుగా తీర్చబడితిరి" (1 కొరి 6:11).

"మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడి యున్నారు; ఇది మీ వలన కలిగినది కాదు; దేవుని వరమే" అని పౌలు చెప్పినప్పుడు

(ఎఫెసీ 2:8), "బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించు చున్నది" యని పేతురు చెప్పుచుండగా (1 పేతు 3:21), పేతురు పౌలును వ్యతిరేకించుట లేదు. రక్షణ దేవుని వరము. ఆయన కృప ద్వారా మానవులు రక్షించబడుదురు. మరియు క్రీస్తు వారి విశ్వాసమూర్తి. బాప్తిస్మము ద్వారా విధేయత చూపు విశ్వాసమే రక్షించే విశ్వాసం. విశ్వాసము రక్షించును, కృప రక్షించును, బాప్తిస్మము రక్షించును.

—ఫ్రేంక్ పేక్.

## క్రీస్తు మరణ పునరుత్థానము

క్రీస్తుతో విశ్వాసియొక్క ఐక్య జీవితమునకు ఆధారము క్రీస్తు యొక్క మానవ జీవితమై యున్నది. ఆయన దేవుడై యుండియు; మానవుడుగా జీవించెను. మానవుడు చేయలేని కార్యములు ఆయన చేసెను. మానవునికి మారుగా ఆయన మరణించెను (రోమా 5:8). "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమి" (రోమా 6:3). క్రీస్తు మాత్రమే మరణమును జయించిన శక్తిమంతుడుగ ప్రత్యక్షపరచు కొనెను (రోమా 1:4; 8:11). ఆయన జీవితమును అనుసరించ వలసినదిగా హెచ్చరింపబడుచున్నాము (1 కొరింథి 11:1; యోహా 12:26).

ఆయన మరణమును జయించి సమాధినుండి తిరిగి లేచి 40 దినముల తరువాత ఆయన పరలోకమునకు ఆరోహణమాయెను. మనకు స్థలము సిద్ధపరచుటకుగాను ముందుగా ఆయన పరలోకమునకు వెళ్లెను (యోహా 14:1, 2). అందుచేత క్రీస్తు తన శిష్యులకు ఆదరణ కరమైన వాగ్దానము ఇచ్చెను. ఆయన మన నిమిత్తమై తండ్రికి విజ్ఞాపన చేయుచున్నాడు. ఆయన యాజకత్వము చేయు

చున్నాడు (హెబ్రీ 7:24). మన భవిష్యత్తు జీవితమునకు నిరీక్షణ చాలా అవసరమై యున్నది. ఈ నిరీక్షణ లేనిదే మన జీవితం అంధకారమై యుండును. ఈ లోకము ఆయన చేసిన నమ్మకమైన సేవ కొరకు న్యాయమైన బహుమానముగా భద్రపరచబడి యున్నది. (ప్రకటన 3:21; లూకా 19:15-17).

పై విషయములను మనము పరిశీలించినచో యేసుక్రీస్తు నందు విశ్వాసముంచిన ప్రతి వ్యక్తియొక్క పరిస్థితికి ఆయన సరిపోయినవాడు ఎట్లనగా - మనము ఆత్మజన్మ మొందునట్లు ఆయన శరీర జన్మమెత్తెను (యోహాను 1:14). మనము కుమారులముగా స్వీకరింపబడునట్లు ఆయన సేవకుడాయెను (ఫిలిప్పి 2:7). మనము ఐశ్వర్యమంతులమగునట్లు ఆయన దరిద్రుడాయెను (2 కొరింథీ 8:9; యాకోబు 2:5). మనము పోషింపబడునట్లుగా ఆయన ఆకలిగొనెను (మత్తయి 4:2; యోహా 6:50). రక్షణాధారమైన బావులలో నుండి మనము నీటిని త్రాగి, దాహము తీర్చుకొనునట్లుగ ఆయన దప్పిగొనెను (యోహాను 19:28; యెష 12:3). మనకు విశ్రాంతి లభించునట్లుగ ఆయన అలసటనొందెను. (మత్తయి 11:28,29). మనము నీతి వస్త్రములు ధరించు నిమిత్తము ఆయన వస్త్రహీనుడాయెను (మత్త 27:28; రోమా 3:22). మనము ఆనందించుటకొరకు ఆయన దుఃఖాక్రాంతుడాయెను (యెష 53:3; ఫిలిప్పి 4:4). మనము స్వతంత్రులముగా చేయబడునట్లు ఆయన బంధింపబడెను (మత్తయి 27:2). మనము నీతిమంతులముగా చేయబడు నిమిత్తము ఆయన పాపముగా చేయబడెను (2 కొరింధి 5:21). మనము జీవించునట్లుగా ఆయన మృతుడాయెను (యోహా 19:33). మనకు నిరీక్షణ కలుగునట్లు ఆయన పునరుత్థానుడయ్యెను (1 కొరింధి 15:12-15).

[illegible]

పరలోకమందున్న వారిలోగాని, భూమిమీద ఉన్నవారిలోగాని ప్రతివాని మోకాలు యేసు నామమున వంగునట్లును ప్రతి

నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును దేవుడాయనను అత్యధికముగా హెచ్చించెను" (ఫిలిప్పి 2:9).

ఇట్టి మహా గొప్ప దేవుని యందు విశ్వాసముంచుము, నీ మనస్సును మార్చుకొనుము, క్రీస్తును గూర్చి ఒప్పుకొనుము పాప క్షమాపణ నిమిత్తమై బాప్తిస్మము పొందుము. దేవుడు నిన్ను ఆశీర్వదించును గాక !

— డి. అబ్రిహాం, నడిపూడి.

---

## బైబిలును గూర్చి కొన్ని విషయాలు

| | | |
|---|---|---|
| 1. | పరిశుద్ధ గ్రంథములోని మొత్తము పుస్తకములు | 66 |
| 2. | పాత నిబంధన గ్రంథములోని మొత్తము పుస్తకములు | 39 |
| 3. | క్రొత్త నిబంధన గ్రంథములోని మొత్తము పుస్తకములు | 27 |
| 4. | పాత నిబంధన గ్రంథములోని మొత్తము అధ్యాయములు | 929 |
| 5. | క్రొత్త నిబంధన గ్రంథములోని మొ॥ అధ్యాయములు | 260 |
| 6. | మొత్తము పరిశుద్ధ గ్రంథములోని అధ్యాయములు | 1189 |
| 7. | పరిశుద్ధ గ్రంథములోని వచనములు | 31173 |
| 8. | పరిశుద్ధ గ్రంథములోని మాటలు | 773746 |
| 9. | పరిశుద్ధ గ్రంథములోని అక్షరములు | 35,67,180 |
| 10. | బైబిలులోని పెద్ద అధ్యాయము - దావీదు కీర్తనలు | 119 |
| 11. | బైబిలులోని చిన్న అధ్యాయము - దావీదు కీర్తనలు | 117 |
| 12. | బైబిలులోని పొడవైన వచనము - | ఎస్తేరు 8 : 9 |
| 13. | బైబిలులోని చిన్న వచనము - | యోహాను 11 : 35 |
| 14. | బైబిలులోని మధ్య పుస్తకము - | కీర్తన 118 : 8 |
| 15. | పాత నిబంధన గ్రంథములోని మధ్య అధ్యాయము యోబు | 29 |
| 16. | క్రొత్త నిబంధన గ్రంథములోని మధ్య పుస్తకము - 2 థెస్స. | |
| 17. | క్రొత్తనిబంధన గ్రంథములోని మధ్య అధ్యాయము - రోమా 13 | |
| 18. | పరిశుద్ధత అను మాట పాత నిబంధనలో 830 సార్లు ఉన్నది. | |
| 19. | పరిశుద్ధత అను మాట పాత నిబంధనలో 250 సార్లు ఉన్నది. | |

—గుంటు నెహెమ్యా కుమార్, తర్లుపాడు.

# ఒక ప్రకటన

1987 నవంబరులో కాకినాడలో జరిగిన లెక్చర్‌షిప్ కొరకు ప్రత్యేకంగా ముద్రించిన కీర్తన పుస్తకాలు మరల ఇప్పుడు మావద్ద లభించుచున్నవి. 28 పాటలు గల చిన్న పుస్తకం ఒక్కొక్కటి ఒక రూపాయి మాత్రమే. పది పుస్తకాలు, అంతకంటె అదనంగా కావలసిన వారికి మాత్రమే అవి పోస్టులో పంపించబడును. వలయువారు ఈ దిగువ చిరునామాకు M.O. చేసి పొందండి.

SATYA VANI
P.O. Box 80, KAKINADA – 533 001.

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To